వేగంగా ధాన్యం కొనాలి

గజ్వేల్: జాలిగామలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న తనూజ



మిరుదొడ్డి: లింగుపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీబీఎఫ్ శంకర్ తదితరులు

- జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తనూజ

గజ్వేల్, మే 17: రైతుల నుంచి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని జిల్లా పౌరసర ఫరాలశాఖ అధికారి తనూజ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని జాలిగామలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఆమె హమాలీలు, రైతులతో మాట్లాడారు. ధాన్యం సేకరణ ఎంత వరకు వచ్చిందో అక్కడి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు వస్తున్న కారణంగా త్వరగా కొనుగోలు చేసిన బస్తాలను లోడ్ చేయాలన్నారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేపట్టాలన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మిరుదొడ్డి, మే 17: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని లింగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి కందిన పంట కండ్లముందే తడిసి కొట్టుకుపోతుంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి ఇస్తామన్న బోనస్ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. కర్షకుల కష్టం

అకాల వర్షం కర్షకుల పాలిట శాపంగా మారింది. ఈనెల 16న కురిసిన వానకు ఉమ్మడి మిరుదొడ్డి మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక ధాన్యం ఎండకు ఆరకుండా తేమ శాతాన్ని ఎక్కువగా చూపించడంతో అధికారులు వడ్లను తూకం వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టార్పాలిన్ కవర్లు ఇవ్వమంటే లేవని అధికారులు చెప్పడంతో చేసేదేమీలేక అద్దెకు తెచ్చుకుంటున్నామని రైతులు పేర్కొన్నారు. వర్షం వల్ల ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందించాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకుల బైండోవర్



తహసీల్ కార్యాలయం వద్ద బైండోవర్ అయిన నాయకులతో బీఆర్ఎస్ నేతలు

చేర్యాల, మే 17: పట్టణానికి చెందిన నలుగురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు శుక్రవారం చేర్యాల తహసీల్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, బీఆర్ఎస్ యువజన నాయకులు అవుశెర్ల కిశోర్, అవుశెర్ల వెంకటేశ్‌ను ఎస్సై దామోదర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య జరిగిన వాగ్వాదం, తోపులాట తదితర వాటిని దృష్టిలో పెట్టుకుని పోలీసులు బీఆర్ఎస్ నాయకులను బైండోవర్ చేశారు. అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీసులు కేవలం బీఆర్ఎస్ నాయకులను బైండోవర్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్ సీఐ శ్రీనును కలిసి తమ పార్టీ నాయకులను ఎందుకు బైండోవర్ చేస్తున్నారని, అధికార పార్టీ నాయకులు ఎన్నిక రోజు ఘర్షణ సృష్టించారని, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పర్యటన సందర్భంగా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారని వివరించారు. దీనికి స్పందించిన సీఐ శ్రీను ఇరువర్గాలకు చెందిన నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని, ఉన్నతాధికారుల అదేశాల మేరకు తాము చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులను బైండోవర్ చేసేందుకు పోలీసులు ఠాణాకు పిలిపించారనే విషయం తెలుసుకున్న ఆపార్టీ నాయకులు శివగారి అంజయ్య, చింతల పరశురాములు, కందుకూరి సిద్ధిలింగం,పచ్చిమడ్ల మానస,బూరగోని తిరుపతిగౌడ్, నర్ర ఐలయ్య,పచ్చిమడ్ల సతీశ్(బాబీ), న్యాయవాది ఉట్కూరి అమర్‌గౌడ్, యాట భిక్షపతి,బాచీ, రావుల గణేశ్ భారీగా స్టేషన్ వద్దకు చేరుకోవడంతో పాటు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి బైండోవర్ అయిన నాయకులకు సంఘీభావం ప్రకటించారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.

కాంగ్రెస్ నాయకుల బైండోవర్

చేర్యాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బండెల మహిపాల్‌రెడ్డి, మామిడాల నాగరాజు, శివరాత్రి నాగేంద్రబాబు, దాసరి శ్రీకాంత్‌ను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.ఇటీవల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద జరిగిన వాగ్వాదం, తోపులాట తదితర ఘటనలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు నాయకులను బైండోవర్ చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట టౌన్, మే 17: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేకతలతో కూడిన ప్రచార కరపత్రం,గోడ పత్రికలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ విద్య అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, అధ్యాపకులు విశ్వనాథం, మధుసూదన్‌రెడ్డి,శ్రద్ధానందం,పాండు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్, మే 17: మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి ఎస్ శంకర్ రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయిల్‌పామ్ మొక్కలకు ఏ దశలో ఎరువులు ఎలా వేయాలి, పామాయిల్‌లో ఎలాంటి అంతర పంటలు వేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. హార్టికల్చర్ అధికారి ఆర్ బాలాజీ, ప్లాంట్ మానిటరింగ్ అధికారి విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ రవళి, రైతులు మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డి, లక్ష్మణ్, జగన్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పాలకుల లక్ష్యం

మాట్లాడుతున్న ఎంపీపీ పుష్పలత

దుబ్బాక, మే 17: ప్రజా సంక్షేమమే పాలకుల లక్ష్యమని దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి అన్నారు. సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శుక్రవారం దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పలు సమస్యలను సభలో ప్రస్తావించారు. ప్రజలకు మౌలిక వసతులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న రాంరెడ్డి

తొగుట, మే 17 : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ తొగుట మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో ఇటీవల బెస్త ప్రభుదాస్ అనే వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం ఆయన మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.4 వేలు ఆర్థిక సహాయం అందజేసి మనోధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివయ్య, రాములు, స్వామిగౌడ్, స్వామి, రాములు, కనుకరాజు పాల్గొన్నారు.

బొడ్రాయి ఏర్పాటుకు భూమిపూజ

బొడ్రాయి ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న మామిడ్యాల్ గ్రామస్తులు

ములుగు, మే 17: మండలంలోని మామిడ్యాల్ గ్రామ పునరావాస కాలనీలో బొడ్రాయి ఏర్పాటుకు శుక్రవారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా మామిడ్యాల్ గ్రామం పూర్తిగా ముంపునకు గురవగా అప్పటి ప్రభుత్వం తునికిబొల్లారంలో నూతన కాలనీ ఏర్పాటు చేసి నిర్వాసితులకు అందించింది. బొడ్రాయి ఏర్పాటు చేసేందుకు ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, గ్రామ పెద్దల సమక్షంలో స్థలాన్ని పరిశీలించి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్యచారి, సాయిరెడ్డి, రామ్‌రెడ్డి, వీరేశంగౌడ్, దర్శన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆరె సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దుచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చేతులు పట్టుకొని వేడుకుంటున్న మహిళలు

బెజ్జంకి, మే 17: మండలంలోని పోతారం గ్రామశివారులో ఏర్పాటు చేసే ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని గ్రామస్తులు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించే స్థలాన్ని ఆయన కంపెనీ ప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి పరిశీలించి, నర్సింహులపల్లి గ్రామ పంచాయతీ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని, నిబంధనల ప్రకారమే పనులు కొనసాగుతాయని వివరించారు. గ్రామశివారులో ఫ్యాక్టరీ నిర్మాణం చేపడితే వ్యవసాయ పంటలు పండవని, భూగర్భ జలాలు, గాలి కలుషితం చెంది జీవించడం కష్టంగా మారుతుందని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. గ్రామస్తుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన తెలిపారు. సమావేశ అనంతరం అదనపు కలెక్టర్ కారులో వెళ్తుండగా గ్రామస్తులు అడ్డుకొని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఆర్డీవో రామూర్తి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ మధు, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై కృష్ణారెడ్డి, ఎంపీవో విష్ణు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రాయితీలు కల్పించాలి

హుస్నాబాద్, మే 17: సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలని, వాటిల్లో పనిచేసే సిబ్బందిని ఆర్థికంగా ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సినిమా థియేటర్లలో పనిచేస్తున్న వందలాది మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని, ఇందుకు కారణం థియేటర్లకు ఆదరణ కరువైందన్నారు. ఓటీటీ, కార్పొరేటర్ మల్టీప్లెక్స్‌లు వచ్చిన తర్వాత చిన్న థియేటర్లు మూత పడుతున్నాయన్నారు. మల్టీప్లెక్స్‌లో ధరలను తట్టుకోలేక ప్రజలు సినిమా చూడటమే మానేస్తున్నారన్నారు.

ఉచిత యోగా తరగతులు ప్రారంభం

మాట్లాడుతున్న శ్రీనివాస్

సిద్దిపేట, మే17: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ తెలిపారు. శుక్రవారం వ్యాస మహర్షి యోగా సెంటర్‌లో చిన్నారులకు ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి షిరిడీ సాయిబాబా ట్రస్ట్ అధ్యక్షుడు గందె శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. యోగా వల్ల విద్యార్థుల మానసిక వికాసంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. ఉచిత శిక్షణ తరగతులు జూన్ 10 వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, యోగా శిక్షకులు తోట అశోక్, సంధ్య పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

ఆరాధన ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

చేర్యాల, మే 17 : పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణ విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో తిరుపతి వైదిక పర్యవేక్షణలో దైవమూర్తులకు పంచామృత అభిషేకం, యజ్ఞంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సంఘం గౌరవ అధ్యక్షుడు నారాయణ, అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, కోశాధికారి కాసుల చిన్న శ్రీనివాస్, మల్లేశం, శ్రీహరి, కృష్ణమూర్తి, ఉప్పల ప్రభాకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం

మిరుదొడ్డిలోని పోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మిరుదొడ్డి, మే 17: మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌లోని అంబేద్కర్ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మతల్లి అమ్మవారి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారికి మహిళలు మంగళ హారతులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పురోహితులు రాజపున్నయ్య, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు

శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

సిద్దిపేట అర్బన్, మే 17: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సిద్దిపేట ఆధ్వర్యంలో 30 రోజుల పాటు 50 మంది మహిళలు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, మగ్గం వర్క్స్ శిక్షణ నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని యూబీఐ ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, ఇతర అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాసవిమాత పారాయణం

వాసవి మాత పారాయణంలో మహిళలు

సిద్దిపేట టౌన్, మే 17: సిద్దిపేట ఆర్యవైశ్య భవన కమిటీ ఆధ్వర్యంలో వాసవి కన్యకపరమేశ్వరికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు పుల్లూరి సుష్మ, వాసవి వనిత క్లబ్ ఆధ్యక్షురాలు వాణి వాసవి మాత జీవిత చరిత్ర పారాయణాన్ని చదివి అమ్మవారిని సేవించారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన నిర్వహించారు. స్వరూపరాణి,అరుణ, మంజుల, సంధ్య మహిళలు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం

సిద్దిపేట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అభయజ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాలలో అన్నదానం చేశారు. అనంతరం విద్యార్థులకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి,పాఠశాల ఉపాధ్యాయుడు జోజి, వీరేశం, అంతయ్య, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంతో కన్యకాపరమేశ్వరి మాత

గజ్వేల్, మే 17: కన్యకా పరమేశ్వరిమాత జయంతిని పురస్కరించుకొని శుక్రవారం గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు పరిధాన్యంతో అమ్మవారి చిత్రాన్ని రూపొందించాడు. అవాలును తీసుకొని రెండు రోజుల పాటు శ్రమించి అద్భుతంగా అద్దాల మందిరం వద్ద చిత్రాన్ని రూపొందించి ఆకట్టుకున్నాడు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

చిన్నకోడూరు, మే 17 : తండ్రిపై చేయి చేసుకొని మనస్తాపంతో పురుగుల మందు తాగిన కుమారుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన వల్లెపు శేఖర్ (24) కూలీ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ నెల 11న మధ్యాహ్నం ఇంట్లో అమ్మ యాదవ్వ, నాన్న మల్లయ్య గొడవ పడుతున్నారని సోదరి ఫోన్ చేసి శేఖర్‌కు చెప్పింది. ఆవేశంగా ఇంటికి వచ్చిన శేఖర్ తండ్రి మల్లయ్యపై చేయి చేసుకొని కొట్టాడు. తర్వాత తండ్రి తప్పేమి లేదని తెలుసుకున్న శేఖర్ తీవ్ర మనస్తాపం చెందాడు. అకారణంగా తండ్రిపై చేయి చేసుకున్నానని.. తండ్రికి తన ముఖం ఎలా చూపించాలని మనస్తాపంతో అదే రోజు అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు, కుటుంబీకులు సిద్దిపేటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందు తూ చనిపోయాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

పోస్టుమార్టం విషయంలో ఘర్షణ

దవాఖానలో చికిత్స పొందుతూ శేఖర్ చనిపోగా రాత్రికి రాత్రే మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండానే ఇంటికి తరలించారు. గురువారం అర్ధరాత్రి చనిపోగా శుక్రవారం అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. గ్రామంలో శవయాత్ర నిర్వహించి దహన సంస్కారాలు చేయబోతున్న ఆఖరి క్షణంలో సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని దహన సంస్కారాలు అడ్డుకున్నారు. ఆత్మహత్య చేసుకున్న యువకుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని పోలీసులు చెప్పారు. అలా చేస్తే అరిష్టమని మృతుడి కుటుంబీకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఒక దశలో లాఠీచార్జి జరిగే దశకు చేరుకుంది. పోలీసులు యువకుడి మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం యువకుడి మృతదేహానికి కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు చేశారు.

రేపటి నుంచి రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

మద్దూరు(ధూళిమిట్ట), మే17: ధూళిమిట్ట మండల కేంద్రంలో ఈనెల 19వ తేదీ నుంచి 22వరకు గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 19న పోచమ్మ బోనాలు, 20న పుట్టకు ధనిపోయుట, పుట్టబంగారం తేవడం, ఎల్లమ్మ కథ, అమ్మవారికి మైలలు తీయుట, 21న రేణుకా ఎల్లమ్మ బోనాలు, రేణుకా ఎల్లమ్మ కల్యాణం, నాగవెళ్లి–పెద్దపట్నం, 22న ఎల్లమ్మతల్లికి మొక్కలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పారుశుధ్య నిర్మూలనకు స్పెషల్‌డ్రైవ్

వర్గల్, మే17: పారుశుధ్య నిర్మూలనకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని నెంటూర్‌లో శుక్రవారం మండల తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి బాల్‌రాజ్, గ్రామ కార్యదర్శి కిరణ్మయి పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల భారీ వర్షాల కారణంగా డ్రైనేజీ సమస్యతో పాటు ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తినట్లు తెలిపారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించామన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్మూలన కోసం చెత్తాచెదారాన్ని తొలిగించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్,గ్రామకార్యదర్శి కిరణ్మయి, విలేజ్ హెల్పర్లు పాల్గొన్నారు.

చెరువు మట్టితో భూసారం పెంపు

మద్దూరు(ధూళిమిట్ట), మే17: చెరువు మట్టితో భూసారం పెంపొందుతుందని ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మద్దూరు మండలంలోని ధర్మారంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువు పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు చెరువు మట్టిని తమ పొలాల్లో పోసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలకు రూ. 300 కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలన్నారు. కొలతలపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మర్మాముల గ్రామ శివారు బంజెరలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి, ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని రామ్మోహన్ ఆదేశించారు. ఆయన వెంట ఈసీ పరశురామ్, టీఏ వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శులు అశోక్, రేణుక, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వంటిమామిడిలో లభ్యమైన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ములుగు, మే 17: మండలంలోని వంటిమామిడిలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏండ్లు ఉంటుందని, మృతదేహాన్ని గజ్వేల్ మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

నేడు సమావేశం

ములుగు, మే 17 : మండల కేంద్రం ములుగులోని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో శనివారం ప్రాంతీయ పరిశోధన, విస్తరణ మండలి సలహా సమావేశం నిర్వహించనున్నట్లు వీసీ డాక్టర్ నీరజా ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ అశోక్‌రెడ్డితో పాటు వివిధ జిల్లాలకు చెందిన ఉద్యానశాఖ సంచాలకులు, జిల్లా స్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. రైతులు, ఉద్యాన పంట సాగు ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ముగ్గురు పిల్లల నిబంధన తొలిగించాలి

గజ్వేల్, మే 17: గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ముగ్గురు పిల్లలుంటే పోటీ చేయరాదనే నిబంధనలను ప్రభుత్వం తొలిగించాలని ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల్లో లేనటువంటి నిబంధనలు స్థానిక ఎన్నికల్లో ఎందుకు ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో ప్రజలకు సేవ చేయాలనుకునే వారు ఈ నిబంధనలతో ప్రజాసేవకు దూరమవుతున్నారన్నారు. ఏపీలో ముగ్గురు పిల్లల నిబంధనలను అక్కడి ప్రభుత్వం తొలిగించిందని గుర్తుచేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు మహిపాల్, రవీందర్ పాల్గొన్నారు.

బహుమతి అందుకున్న శరణ్య

సిద్దిపేట అర్బన్, మే 17: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు వివిధ్న అంశాల్లో పోటీలు నిర్వహించగా.. వ్యాసరచన విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బక్రిచెప్యాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బండి శరణ్య జిల్లాలో ప్రథమ బహుమతి, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు శుక్రవారం సిద్దిపేటలోని స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ చేతుల మీదుగా శరణ్య జ్ఞాపికతో పాటు నగదు బహుమతిని అందుకున్నది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

చేర్యాల, మే 17: మండలంలోని వీరన్నపేటలో ఇటీవల తాటి చెట్టుపై